## క్లుప్తంగా

### ఎంపీ వేమిరెడ్డిని కలిసిన డీఏఏబీ చైర్మన్



**కోవూరు:** వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి నెల్లూరులోని నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీని శాలువాతో సత్కరించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర బొందిలి సంఘం కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్, కోవూరు మండల యువజన విభాగాధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, బీసీ సెల్ అధ్యక్షుడు కేతా మల్లికార్జున, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కవరగిరి ప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నలుబోతు అంజనరావు, తదితరులు ఉన్నారు.

### దేవస్థానానికి నగదు విరాళం



**పొదలకూరు :** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మీ గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి పార్లపల్లి రమేష్‌రెడ్డి దంపతులు రూ.50 వేల నగదు విరాళాన్ని సోమవారం ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో దేవస్థానం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మరో రూ.50 వేల నగదును స్వామి, అమ్మవార్లకు అందజేస్తామన్నారు.

### గిరిజన కాలనీ పాఠశాల తనిఖీ



**కొడవలూరు:** మండలంలోని గుండాలమ్మపాళెం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జీ వసంతకుమారి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ వెంట హెచ్ఎం హేమలత ఉన్నారు.

### దహన వాటిక ప్రారంభం



**బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని రేబాలలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన కైలాస భూమిలో దహన వాటికను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో రూ.50 లక్షలతో శ్మశాన వాటికను నిర్మించినట్లు తెలిపారు. అందులో భాగంగా తొలుత దహన వాటికను ప్రారంభించామన్నారు. నాయకులు శివరామకృష్ణారెడ్డి, పోసింరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### జెడ్పీ సీఈఓను కలిసిన మత్స్యశాఖ అసిస్టెంట్లు



**బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు):** విడవలూరు మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మత్స్యశాఖ అసిస్టెంట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఈఓను శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహన్, దివ్య పాల్గొన్నారు.

### బోర్లు, మోటార్ల ధ్వంసంపై ఫిర్యాదు

**నెల్లూరు(క్రైమ్):** పొలంలోని బోర్లు, మోటార్లు ధ్వంసం చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు..నెల్లూరు రూరల్ మండలం ఓగూరుపాడులో విజయరామిరెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయనకు అక్కచెరువుపాడు గ్రామంలో పొలం ఉంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం పొలంలో ఐదు బోర్లు వేసి 5హెచ్‌పీ మోటార్లు వాటికి బిగించి ఉన్నారు. ప్రతిరోజూ విజయరామిరెడ్డి పొలానికి వెళ్లి వచ్చేవారు. ఈ నెల 1న సైతం ఆయన పొలానికి వెళ్లి సాయంత్రం వరకు ఉండి వచ్చారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బోర్లు, మోటార్లను ధ్వంసం చేశారు. బోరులో కంకరరాళ్లు పోశారు. పొలం కాపలాదారుడు భక్తవత్సలరెడ్డి సోమవారం సాయంత్రం గమనించి విజయరామిరెడ్డికి తెలియజేశారు. ఈ మేరకు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

**పొదలకూరు :** పట్టణ ప్రజలు వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీగోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. వేకువజామున ధనుర్మాస పూజలు, 8 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం నిర్వాహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల రమణయ్యనాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, ఎస్.మురళీ, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- పట్టణంలోని అయ్యప్పనగర్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనాన్ని భక్తులకు కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శ్రీవారికి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- పట్టణంలోని గీతామందిరంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారిని విశేషంగా అలంకరించి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం గోపూజ, గీతాపారాయణం, విష్ణుసహస్రనామార్చన, బంగారు పూలతో అష్టోత్తరం, తదితర పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా నున్నా బ్రదర్స్ వ్యవహరించారు. గీతామందిర కమిటీ కార్యదర్శి అనిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

**కొడవలూరు:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కొడవలూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీధరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీధరస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు రంగవల్లులతో స్వాగతం పలికి నైవేద్యాలు సమర్పించారు.

**ముత్తుకూరు:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముత్తుకూరు, ఈపూరు, నేలటూరు, తాళ్లపూడి పంచాయతీల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. శ్రీవారి గ్రామోత్సవాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ఇందుకూరుపేట:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వైష్ణాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఇందుకూరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు ఉదయగిరి వెంకటశేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీవారిని శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. మైపాడు శివాలయంలో అర్చకులు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

**మనుబోలు:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వైష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మనుబోలులోని విష్ణాలయం, చెన్నకేశవ ఆలయం, పిడూరు, ఎల్ఎన్‌పురం, మడమనూరులోని నర్సింహస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారిని విశేషంగా ఆలంకరించి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మనుబోలు చెన్నకేశవస్వామికి గరుడ వాహన సేవను నేత్ర పర్వంగా నిర్వహించారు. పెనుగొండ సుధాకర్, శాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

**తోటపల్లిగూడూరు:** మండల ప్రజలు వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కాటేపల్లి, కోడూరులోని శివాలయాలు, తోటపల్లి గూడూరులోని శ్రీఖరేశ్వరస్వామి ఆలయం, పేడూరులోని కామాక్షి సమేత చంద్రశేఖర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

#### చందనాలంకారంలో అలఘునాథస్వామి

**బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు):** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పార్లపల్లిలోని అలఘునాథ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారిని చందనంతో అలంకరించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం శ్రీవారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఈట హేమచంద్రరావు, స్థానికులు వెంకటేశ్వర్లు, హరిప్రసాద్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో శేషవాహనంపై నరసింహస్వామి



కొడవలూరులో శ్రీధరస్వామి గ్రామోత్సవం



మనుబోలు: విశేషాలంకారంలో శ్రీవారు



తోటపల్లిగూడూరులో ఖరేశ్వరస్వామి గ్రామోత్సవం



ముత్తుకూరులో చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



మైపాడులో శ్రీరాముడి గ్రామోత్సవం



మనుబోలు: చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



పార్లపల్లిలో అలఘునాథస్వామి గ్రామోత్సవం

### రేపట్నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

**బుచ్చిరెడ్డిపాళెం:** కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఆరో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి ఇంటింటిని సందర్శించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నారు.

**కోవూరు:** ఈ నెల 3న కోవూరులోని కోనమ్మ తోట, నాగులకట్ట, రాళ్లమిట్టలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నూతన పింఛన్లను పంపిణీ చేయనున్నారు. 4న కోవూరులోని వడ్డిపాళెం, మసీదువీధి, 5న కోవూరులోని సత్రంవీధి, గమ్మళ్లపాళెం, 23న పెద్దపడుగుపాడు, చంద్రమౌళీనగర్, 24న హరిజనవాడ, కొత్త హరిజనవాడ, చంద్రమౌళీనగర్, 25న మిక్సెడ్‌కాలనీ, పడుగుపాడులో పర్యటించనున్నారు.

**ఇందుకూరుపేట:** ఈ నెల 6,7,9 తేదీల్లో గంగపట్నంలో పర్యటించనున్నారు.

**కొడవలూరు:** ఈ నెల 17, 18 తేదీల్లో కొడవలూరు, 27,28 తేదీల్లో యల్లాయపాళెంలో గడప గడపకు నిర్వహించనున్నారు.

**విడవలూరు:** ఈ నెల 19న పెదపాలెం, వెంకటరెడ్డిపాళెం, శంభునిపాళెంలో పర్యటించనున్నారు.

**బుచ్చిరెడ్డిపాళెం:** ఈ నెల 8న బుచ్చిరెడ్డిపాళెం 3వ సచివాలయం, 20న పెనుబల్లి, 21న సాల్మన్‌పురం, 30న బుచ్చిరెడ్డిపాళెం 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు.

### నేడు సీఆర్‌సీకు మంత్రి కాకాణి రాక

**వెంకటాచలం:** మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్‌సీ)కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం రానున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మారుతీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌సీ 7వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం 10 గంటలకు నిర్వహించే దివ్యాంగుల ఉచిత జాబ్‌మేళాలో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

### నేడు కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

**కోవూరు :** మండల కేంద్రంలోని సచివాలయం -5 పరిధిలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం పర్యటిస్తారని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. 'గడప గడప మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి ఎమ్మెల్యే ప్రసన్న ఆసరా

- ఎన్ఎస్సార్ఎం ట్రస్ట్ ద్వారా పది కుట్టుమెషీన్ల పంపిణీ

**కొడవలూరు:** పేద మహిళల స్వయం ఉపాధికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆసరాగా నిలిచారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పది మంది మహిళలకు కుట్టు మెషిన్లు అందజేశారు. గత నెల 29న మండలంలోని మిక్కిలింపేటలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు కుట్టు మెషిన్లు అందజేస్తే స్వయం ఉపాధి పొందుతామని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్న తన సొంత నిధులతో ఎన్ఎస్సార్ ట్రస్ట్ ద్వారా కుట్టుమెషిన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.65 వేల విలువైన పది కుట్టు మెషిన్లను మహిళలకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్, డీఎల్‌డీఏ చైర్మన్లు వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు జుటూరు వెంకటకృష్ణారెడ్డి, కొండా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మెషిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

## విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



పొదలకూరు: ప్రభుత్వం అందజేసిన ట్యాబ్స్‌ను చూపుతున్న విద్యార్థులు

**మనుబోలు:** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని గురివిందపూడి సర్పంచ్ మన్నెమాల సమత అన్నారు. గురివిందపూడి ప్రాథమికోన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను సర్పంచ్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నెమాల సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**పొదలకూరు :** ఇనుకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించే లక్ష్యంతో ట్యాబ్స్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెదమల్లు రమణారెడ్డి పాల్గొన్నారు.



మనుబోలు మండలం గురువిందపూడిలో..

## ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ

**బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు)/కోవూరు:** చౌకదుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు పంపిణీ చేస్తున్న కిలో రూపాయి బియ్యాన్ని జనవరి నుంచి డిసెంబర్ వరకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు విడవలూరు తహసీల్దార్ చంద్రశేఖర్, కోవూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ గోడ కృష్ణప్రసాద్ సోమవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టం కిందకు వచ్చే తెల్లకార్డుదారులకు ఏడాది పాటు ఉచితంగా బియ్యం అందజేయనున్నట్లు తెలిపిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర వాటా బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుందని వివరించారు. కోవూరు , కొడవలూరు, విడవలూరు మండలాల పరిధిలో 117 చౌకదుకాణాల ద్వారా 5,3044 మంది తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యం పథకం అమల్లోకి వస్తుందన్నారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కొత్త పింఛన్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**వెంకటాచలం:** రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీ, ఇందిరమ్మకాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి కాకాణి విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగా మంత్రులు దగ్గర నుంచి వార్డు సభ్యుల వరకు గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనులను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడంతో గడప గడపలో ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను నేరుగా వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. అర్హత కలిగిన పేదలకు నివేశన స్థలాలను అందజేసి ఇళ్లు కట్టిస్తుండగా టీడీపీ కోర్టులకు వెళ్లి అడ్డుకునే కుట్రలు చేసిందని విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టించే విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని, కోర్టు కేసులను అధిగమించి అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇళ్లు కట్టించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్లను లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. తహసీల్దార్ వై నాగరాజు, ఎంపీడీఓ సుస్మిత, వైస్ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, రాచాల రవికుమార్ యాదవ్, కుంచె రమేష్ యాదవ్, కప్పిర సూరి, ఎంపీటీసీలు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, ఏడుకొండలు, సర్పంచ్ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల వితరణ



**బుచ్చిరెడ్డిపాళెం:** స్థానిక మదర్‌హోమ్ అనాథ ఆశ్రమానికి కొడవలూరు మండలంలోని ఓవెల్ పాఠశాల విద్యార్థులు నిత్యావసర సరుకులను సోమవారం వితరణ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థు స్వచ్ఛందంగా కొంత నగదును సేకరించి 95 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ హరిబాబు, వైస్ ప్రిన్సిపల్ సునీత పాల్గొన్నారు.

### పురస్కారాల ప్రదానం నేడు

**నెల్లూరు(అర్బన్):** సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఇందుకూరు ప్రభాకర్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయినులకు పురస్కారాలను మంగళవారం ప్రదానం చేయనున్నట్లు ఆ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దెపూడి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమందిరంలో సాయంత్రం 5 గంటలకు జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి డీఈఓ సుబ్బారావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ప్రజారోగ్య వేదిక రాష్ట్రాధ్యక్షుడు ఎంవీ రమణయ్య, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు.

## వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

**ముత్తుకూరు:** 2023 సంవత్సరానికి సంబంధించి ముత్తుకూరు వాసవి క్లబ్, వాసవి వనితా క్లబ్ నూతన కార్యవర్గాలను సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన కార్యవర్గ సమావేశాల్లో వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా చందా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా చెక్కా శ్రీనివాసులు, కోశాధికారిగా కనిశెట్టి సుబ్బయ్యను ఎన్నుకున్నారు. వనితా క్లబ్ అధ్యక్షురాలిగా గుడివాడ సుజాత, కార్యదర్శిగా సరాబు రమాదేవి, కోశాధికారిగా పైడా అనిలను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు కుప్పం నరసింహారావు, కోఆర్డినేటర్ చందా వెంకటస్వామి, ఇన్‌చార్జి సుప్రజ, రీజనల్, జోన్ చైర్మన్లు సత్యనారాయణ, కృష్ణవేణి పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గాలు

## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

**కొడవలూరు:** ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని సినార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీపీ జవహర్ పేర్కొన్నారు. కొడవలూరులో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులతో పండించిన ఉత్పత్తులు ఎంతో ఆరోగ్యకరమన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మార్కెటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన దశపల్లి, నీమాస్త్రం, ఇంగువ ద్రావణం, ద్రవ జీవామృతం, బీజామృతం , బవారియా కషాయం, తదితరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులు లభ్యమవుతాయని వివరించారు. కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి, బోగోలు, కావలిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. సినార్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవళ్లిక, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సినార్డ్ పీడీ జవహర్